సాక్షి
శ్రీకాకుళం
బుధవారం । 29 । మార్చి । 2023



రిమ్స్ హాస్టల్‌లో కొట్లాట

రిమ్స్ హాస్టల్‌లో విద్యార్థుల మధ్య కొట్లాట జరిగింది. దీనిపై అధికారులు విచారణ చేస్తున్నారు. - 8లో



మేనల్లుడి బైక్ ఢీకొని..

మేనల్లుడి బైక్ ఢీకొని మేనమామ చనిపోయారు. నందిగాంలో ఘటన జరిగింది. - 8లో

ఇద్దరు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

టెక్కలి: విధుల్లో అలసత్వం ప్రదర్శించిన ఇద్దరు ఉపాధ్యాయులకు జిల్లా విద్యా శాఖాధికారి జి.పగడాలమ్మ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మండలంలోని అక్కవరం ఎంపీయూపీ పాఠశాలను డీఈఓ పగడాలమ్మ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించగా సరైన సమయానికి విధులకు హాజరు కాకపోవడం. విధుల్లో అలసత్వం ప్రదర్శించడంతో ఇద్దరు టీచర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.



న్యూస్‌రీల్

2న జిల్లా చెస్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా అండర్-17 బాలబాలికల చెస్ ఎంపిక పోటీలు ఏప్రిల్ 2వ తేదీన జరగనున్నాయి. శ్రీకాకుళం నగరంలోని నానుబాల వీధిలో గల చెస్ కోచింగ్ సెంటర్‌లో పోటీలు నిర్వహించనున్నట్లు ఏపీ రాష్ట్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శి సనపల భీమారావు తెలిపారు. ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2006 జనవరి ఒకటి తర్వాత జన్మించి ఉండాలని స్పష్టంచేశారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారుల్లో బాలికలు విజయవాడలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు. అలాగే బాలురు అనకాపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు రూ.300 ప్రవేశ రుసుం చెల్లించి డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఏపీచెస్.ఓఆర్జీ వెబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9912559735 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రూ.లక్షల్లో పన్నుల వసూలు



వడ్డీ మాఫీతో మున్సిపాలిటీకి పన్ను చెల్లిస్తున్న ట్రాన్స్‌పోర్ట్ యజమాని

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలో ఆస్తి పన్నుని ఈ నెల 31 తేదీలోపు చెల్లించిన వారికి వడ్డీమాఫీ చేస్తామని మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ తెలిపారు. మున్సిపాలిటీ ఏఎస్‌పేట బోర్డర్‌లో గల సౌత్‌ఈస్టర్న్ రోడ్ వేస్ కార్యాలయం-1 పన్నుని 2008 నుంచి ఇప్పటివరకు చెల్లించలేదు. దీంతో వడ్డీతో కలిపి రూ.23,79,461, సౌత్‌ఈస్టర్న్ రోడ్‌వేస్ కార్యాలయం-2 కి సంబంధించిన పన్ను 2019 నుంచి ఇప్పటి వరకు చెల్లించక పోవడంతో వడ్డీతో కలిపి రూ.2,27,466లకు బకాయిలు చేరాయి. బకాయి మంగళవారం మున్సిపాలిటీకి చెల్లించడంతో ఆస్తిపన్ను వడ్డీ మొత్తం మాఫీ చేశారు. కార్యాలయం-1 నకు రూ.9,07,508, సౌత్‌ఈస్టర్న్ రోడ్వేస్ కార్యాలయం-2 నకు రూ.1,57,394 లను చెల్లించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, మున్సిపల్ ఆర్ఐ అమర్, వార్డు కౌన్సిలర్ తవిటయ్య పాల్గొన్నారు.

జీఎస్టీ సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

సాక్షి, విశాఖపట్నం : రాష్ట్ర పన్నుల శాఖ విశాఖపట్నం డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ ఎ.రాజేశ్వరిని జాయింట్ కమిషనర్ నాగార్జునరావు సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోంది. శ్రీకాకుళం సీటీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న రాజేశ్వరి గత కొద్ది రోజులుగా క్రమశిక్షణారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారులపై నేరుగా ఫిర్యాదులు చేస్తున్న విషయాలు బహిర్గతమయ్యాయి. ఈ వ్యవహారంపై సీరియస్ అయిన రాష్ట్ర పన్నుల శాఖ కమిషనరేట్ ఉన్నతాధికారులు.. రాజేశ్వరిపై చర్యలకు ఉపక్రమించాలని జేసీ-1ని ఆదేశించారు. ఈ మేరకు జేసీ-1 నాగార్జునరావు రాజేశ్వరిని సస్పెండ్ చేసినట్లు విశాఖ డివిజన్ కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

ఆ నలుగురిపై వేటు సరైనదే



ధర్మాన కృష్ణదాస్


నరసన్నపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కలిగిన పార్టీ అని, పార్టీలో ఉంటూ క్రమశిక్షణ తప్పితే చర్యలు తప్పవని, దీనికి నిదర్శనమే ఆ నలుగురు ఎమ్మెల్యేల సస్పెన్షన్ అని నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రత్యర్థి పార్టీతో చేతులు కలిపి సొంత పార్టీకి వ్యతిరేకంగా వ్యవహించిన ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడం సరైన నిర్ణయమేనని అన్నారు. పార్టీ నిర్దేశించిన వ్యక్తికి కాకుండా మరో వ్యక్తికి ఓటేసినట్లు నిర్ధారణ అయిన తర్వాతే చర్యలు తీసుకున్నారని తెలిపారు. జగనన్న ఫొటోతో గెలిచిన వీరు వెన్నుపోటు పొడవటం బాధాకరమన్నారు. అలాగే సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిపై ఆ నలుగురు ఎమ్మెల్యేలు విమర్శలు చేయడం తగదన్నారు. ఎవరైనా సరే పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉండాల్సిందేనని తెలిపారు.

రహదారిపై రక్షా కవచం



చిలకపాలెం-పాగిరి రహదారిలో హైవే పెట్రోలింగ్

రహదారులను ఎంత విస్తరించినా ఇంకా చాలదన్నట్లు కిక్కిరిసిపోతున్నాయి. ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్న వాహనాలు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ప్రమాదాలు సృష్టిస్తూనే ఉన్నాయి. రోడ్డెక్కే వారు క్షేమంగా, భద్రంగా తిరిగి వచ్చేవరకు బెంగే. ప్రధాన రహదారులు ప్రమాదాల నిలయాలుగా.. మృత్యుదారులుగా మారిపోతున్నాయి. ఆ ప్రమాదాల దారులపైనే వారు ఉద్యోగం చేస్తున్నారు. నిత్యం రోడ్లపైనే సంచరిస్తూ ప్రమాదాలను సవాల్ చేస్తున్నారు. ప్రజల ప్రాణాలు రక్షించడానికి తమ ప్రాణాలను పణంగా పెడుతున్నారు. వారే హైవే పెట్రోలింగ్ పోలీసులు. జాతీయ, రాష్ట్ర రహదారులపై రెప్పవాల్చకుండా నిఘా పెట్టి శక్తి మేరకు రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేస్తున్నారు. క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రులకు తరలించి ప్రాణదాతలుగా నిలుస్తున్నారు.



- ప్రాణ రక్షణే ధ్యేయంగా హైవే పెట్రోలింగ్ టీం కృషి
- రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ
- ప్రతి 20 కిలోమీటర్లకు ప్రత్యేక వాహనం
- బ్లాక్‌స్పాట్‌లపై ప్రజలకు విస్తృత అవగాహన

శ్రీకాకుళం డెస్క్/ క్రైం

175 కిలోమీటర్ల జాతీయ రహదారి.. మరో 50 కిలోమీటర్ల స్టేట్‌హైవే.. ప్రతి 20 కిలోమీటర్లకు ఓ వాహనం.. ప్రతి వాహనంలో ముగ్గురు సిబ్బంది అత్యంత అప్రమత్తంగా విధి నిర్వహణ.. నిరంతరం మోగే వైర్‌లెస్ సెట్లలో ఆదేశాల్ని పాటిస్తూ మూడు షిఫ్టుల్లో ప్రజారక్షణే ధ్యేయంగా పనిచేస్తున్నారు హైవే పెట్రోల్ సిబ్బంది. ఎక్కడైనా ప్రమాదం జరిగితే క్షణాల్లో చేరుకుని గోల్డెన్ అవర్‌లో క్షతగాత్రుల్ని ఆస్పత్రికి తరలించి ప్రాణాల్ని కాపాడుతున్నారు. జిల్లాలో గుర్తించిన 57 బ్లాక్ స్పాట్‌లపై ప్రత్యేక దృష్టిసారించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

ప్రధాన విధులు..

- జాతీయ రహదారిపై నిఘా..
- జాతీయ రహదారిపై ఉండే పాఠశాలల పరిసరాల్లో స్కూల్‌కు వెళ్లేటప్పుడు.. బడి పిల్లలు స్కూల్ నుంచి వచ్చేటప్పుడు ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం.
- ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను వారికి నిర్దేశించిన సమయంలో కవర్ చేయడం.
- అధిక వేగంతో ప్రయాణించే వారిని నిరోధించడం.
- ఎస్పీ కార్యాలయం నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా అప్రమత్తంగా వ్యవహరించడం.
- భారీ వాహనాలకు సంబంధించిన ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రుల్ని గోల్డెన్ అవర్‌లో ఆస్పత్రులకు తరలించడం.. రోడ్డును వెంటనే క్లియర్ చేయడం..
- రాత్రి వేళల్లో వాహనాలు నడిపే డ్రైవర్లను టోల్ ప్లాజాల వద్ద ఆపి ఫేస్‌వాష్(స్టాప్-వాష్-గో) కార్యక్రమం నిర్వహణ..

బ్లాక్ స్పాట్ అంటే..

మూడేళ్ల కాలపరిమితిలో ఐదుసార్లు రోడ్డు ప్రమాదాలు జరిగినా లేదా ఒకే స్పాట్‌లో (ప్రమాదం) పది మంది వరకు చనిపోయినా ఆ ప్రాంతాన్ని బ్లాక్ స్పాట్‌గా పరిగణిస్తారు.

57 బ్లాక్‌స్పాట్‌ల పైనే దృష్టి..

జిల్లా వ్యాప్తంగా 57 బ్లాక్‌స్పాట్‌లను అధికారులు గుర్తించారు. హైవే ప్రెటోలింగ్ సిబ్బంది ఆ బ్లాక్ స్పాట్‌లపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి రోజూ ఆయా ప్రాంతాలపై అవగాహన కల్పిస్తూ.. అతి వేగం ప్రమాదకరమనే విషయాన్ని వాహనచోదకులకు వివరిస్తున్నారు. బ్లాక్‌స్పాట్‌లపై అవగాహన విషయంలో సిబ్బందికి జిల్లా ఎస్పీ జీఆర్ రాధిక ప్రత్యేక సూచనలిస్తూ ప్రమాదాల నివారణకు తనవంతు ప్రయత్నం చేస్తున్నారు. అలాగే బ్లాక్ స్పాట్‌లు ఉండే ఏరియాలో ప్రత్యేక బోర్డుల ఏర్పాటు చేస్తూ ప్రాణం విలువ తెలిసేలా వివిధ అవగాహన కార్యక్రమాలను జిల్లా పోలీసులు ఏర్పాటు చేస్తున్నారు. రోడ్డు నిర్మాణం, సాంకేతిక ఇతర అంశాలపై క్షుణ్నంగా అధ్యయనం చేసి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

బ్లాక్ స్పాట్‌గా గుర్తించిన శ్రీకాకుళం బైపాస్ జంక్షన్



బ్లాక్ స్పాట్‌లు ఎక్కడెక్కడ..

- ఎచ్చెర్ల మండల పరిధిలో అధికంగా 7 బ్లాక్ స్పాట్‌లున్నాయి.
- శ్రీకాకుళం రూరల్ పరిధి, జేఆర్‌పురంలలో 6 చొప్పున బ్లాక్ స్పాట్‌లున్నాయి.
- సరుబుజ్జిలి, నందిగాం మండలాల పరిధిలో 4 చొప్పున ఉన్నాయి.
- కోటబొమ్మాళి పరిధిలో 3 ఉన్నాయి.
- నరసన్నపేట, కాశీబుగ్గ, బారువ, కంచిలి, మందస పరిధిలో రెండేసి చొప్పున స్పాట్స్ ఉన్నాయి.
- గార, ఆమదాలవలస, టెక్కలి, ఇచ్ఛాపురం టౌన్, పాతపట్నం, కొత్తూరు పరిధిలో ఒక్కో బ్లాక్ స్పాట్‌ను గుర్తించారు.
- వీటితో పాటు ట్రాఫిక్‌కు సంబంధించి వివిధ ప్రాంతాల్లో కొన్ని బ్లాక్ స్పాట్‌లను గుర్తించారు.



స్టాపర్లను ఏర్పాటు చేస్తున్న ఎస్సై రాజేష్



డ్రైవర్‌తో ఫేస్‌వాష్ చేయిస్తున్న పోలీసు

భద్రతే మా బాధ్యత..



జాతీయ, రాష్ట్ర రహదారులపై ప్రమాదాలు జరగకుండా భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాం. డ్రోన్ కెమెరాలతో 57 బ్లాక్ స్పాట్‌లు గుర్తించాం. భద్రతా నియమాలపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. మొబైల్ పెట్రోల్ టీమ్‌ల పనితీరుపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం. ప్రతి నెలా సమీక్షా సమావేశంలో జిలా కలెక్టర్, ఆర్అండ్‌బీ, నేషనల్ హైవే అథారిటీ, ఇంజినీర్లతో ప్రమాదాల నివారణపై ఎలాంటి చర్యలు తీసుకోవాలన్నదానిపై చర్చిస్తున్నాం. నేషనల్ హైవే అథారిటీ, ఆర్అండ్‌బీ వారు రోడ్డు పక్కనే కాకుండా అండర్ పాస్ వే కింద ఇసుక, మట్టి, ముళ్లపొదలు వంటివి ఎప్పటికప్పుడు క్లీన్ చేసి, స్కూల్, విలేజ్ జోన్ వంటి వాటి దగ్గర మిడిల్ వేలైన్ నుంచి వెళ్లేలా ఏర్పాట్లు చేస్తే మరింతగా ప్రమాదాలను నివారించవచ్చు.

– జీఆర్ రాధిక, జిల్లా ఎస్పీ

అనుక్షణం అప్రమత్తం..



ప్రతి క్షణం అప్రమత్తంగా ఉంటున్నాం. రహదారిపై సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేసేవారికి కౌన్సిలింగ్ ఇస్తున్నాం. బ్లాక్‌స్పాట్‌ల వద్ద అవగాహన కల్పిస్తున్నాం. ప్రమాదం జరిగిన సమాచారం అందిన వెంటనే వీలైనంత వేగంగా సంఘటనా స్థలికి చేరుకుని సేవలందిస్తున్నాం.

–జగన్‌మోహన్‌రావు, హెడ్‌కానిస్టేబుల్, హైవే పెట్రోలింగ్ టీమ్

నిరంతర గస్తీ..



24 గంటలు సిబ్బంది విధుల్లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. మూడు షిఫ్టుల్లో పనిచేస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందగానే సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం. ప్రాణరక్షణే ప్రథమ కర్తవ్యంగా విధులు నిర్వర్తిస్తున్నారు. లొకేషన్ ఆధారంగా ప్రతి గంటకూ వీరిని మోనిటరింగ్ చేస్తుంటాం.

– బూర ప్రసాదరావు, ఇన్‌చార్జి సీఐ, డీటీఆర్‌బీ

హనుమ గుండెలో రామ



భద్రాచలంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో ఆమదాలవలస మండలం గాజులకొల్లివలస గ్రామానికి చెందిన సైకత శిల్పి గేదెల హరికృష్ణ చేసిన సైకత శిల్పం ఆకట్టుకుంటోంది. హనుమంతుని గుండెల్లో రాముడు ఉన్నట్లు ఇసుకతో చేసిన సైకత శిల్పం చూపరులను ఆకర్షిస్తోంది.

– ఆమదాలవలస రూరల్

అమ్మకి వందనం



మండలంలోని అవలంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాతపట్నంకు చెందిన రామరాజు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో (మాతృదేవోభవ) తల్లికి వందనం కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయుడు బి.గొల్లవాడు మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో వారి తల్లులకు పాదపూజ చేయించారు. ఎంఈఓలు కె.రాంబాబు, ఎం.వెంకటరమణలు పాల్గొని కార్యక్రమాన్ని మెచ్చుకున్నారు. అనంతరం టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు.

– హిరమండలం

ధ్వజారోహణం



అరసవల్లి సూర్యనారాయణ స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ మంగళవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. చైత్ర శుద్ధ సప్తమి పర్వదినాన కల్యాణ మహోత్సవాల్లో తొలిరోజున కల్యాణాంగ ధ్వజారోహణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఆలయ గరుడ ధ్వజస్తంభం వద్ద పతాకావిష్కరణ, ధ్వజారోహణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా అర్చకులు నిర్వహించారు.

– అరసవల్లి

నిస్వార్థంగా సేవ చేయండి



అనివెట్టి మండపంలో కొత్త ధర్మకర్తలతో మంత్రి ధర్మాన ప్రసాదరావు

- మంత్రి ధర్మాన ప్రసాదరావు
- అట్టహాసంగా అరసవల్లి ధర్మకర్తల ప్రమాణ స్వీకారం

అరసవల్లి: అరసవల్లి ఆదిత్య క్షేత్రం పాలక మండలి సభ్యులుగా, ధర్మకర్తలుగా అవకాశం పొందిన వారు నిస్వార్థంగా సేవ చేయాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు సూచించారు. అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం ఉదయం నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇంద్రపుష్కరిణి వద్ద శ్రీ వైజయంతి ఉత్సవ వేదికపై జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి ధర్మాన సమక్షంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా ఇప్పిలి జోగిసన్యాసిరావు, ఎక్స్‌అఫీషియో సభ్యునిగా ఇప్పిలి శంకరశర్మతో పాటు నూతన ధర్మకర్తలుగా మండవల్లి రవి, డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, ద్వారపు అనూరాధ, నెమలిపురి కోటేశ్వరరావు చౌదరి, దుక్క గన్నిరాజు, జలగడుగుల శ్రీనివాస్, మైలపల్లి లక్ష్మి, వాబ లోకేశ్వరి, జోగి మల్లెమ్మ తదితరులతో జిల్లా దేవదాయ శాఖాధికారి హోదాలో వి.హరిసూర్యప్రకాష్ ప్రమాణ స్వీకారం చేయించారు. అయితే వ్యక్తిగత కారణాలతో లుకలాపు గోవిందరావు ప్రమాణ స్వీకారానికి హాజరు కాలేదని, త్వరలో ఆయనతో ప్రమాణ స్వీకారం చేయిస్తామని హరిసూర్య ప్రకాష్ ప్రకటించారు. అనంతరం మంత్రి ధర్మాన మాట్లాడుతూ రెండేళ్ల పాటు సభ్యులంతా ఆలయ అభివృద్ధికి పాటు పడాలన్నారు. అజమాయిషీ చేయకుండా సేవ చేసేందుకు పదవిని ఉపయోగించాలని పేర్కొన్నారు. అరవసల్లి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నామని, సీఎం వైఎస్ జగన్ కూడా ఆలయ భూముల విషయంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువనేత ధర్మాన రామమనోహర్ నాయుడు, తూర్పు కాపు సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, గార, సారవకోట ఎంపీపీలు గొండు రఘురాం, చిన్నాల కూర్మినాయుడు, పార్టీ నేతలు వైవీ సూర్యనారాయణ, ఎంవీ పద్మావతి, సాధు వైకుంఠరావు, సుంకరి కృష్ణ, అంధవరపు ప్రసాద్, ఎం.వి.స్వరూప్, పైడి మహేశ్వరరావు, మండల మన్మధరావు, ద్వారపు అజిత్, మెండ లాల్‌బహదూర్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా కారుణ్య నియామకాలు



కొత్తగా ఉద్యోగాలు పొందిన వారితో జెడ్పీ చైర్‌పర్సన్ విజయ. చిత్రంలో సీఈఓ వెంకట్రామన్

అరసవల్లి: జిల్లా పరిషత్ చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా కారుణ్య నియామకాల ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోంది. వివిధ కారణాలతో మృతి చెందిన పీఆర్ ఉద్యోగుల కుటుంబ సభ్యుల్లో అర్హులకు మంగళవారం ఉదయం మొత్తం 10 మందికి వివిధ మండలపరిషత్‌లలో ఉద్యోగాలను కల్పిస్తూ ఉత్తర్వులు అందజేయగా, మరో నలుగురు ఉద్యోగులకు పదోన్నతులను కల్పించేలా జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ చర్యలు చేపట్టారు. సాంఘిక భద్రత కారుణ్య పథకం కింద టైపిస్టులుగా కె.చందన వంశీ (ఎంపీపీ బూర్జ), ఎం.దేవి (పీఆర్ఐ, టెక్కలి), వెంకట ప్రవీణ (ఎంపీపీ వజ్రపుకొత్తూరు), ఎస్.రతన్ జగన్మోహన్ (ఎంపీపీ జి.సిగడాం), బెహరా నీరజ (పీఆర్ఐ, పాలకొండ)లకు నియామక పత్రాలను అందజేశారు. అలాగే ఆఫీస్ సబార్డినేట్లుగా పి.సత్యశ్రీనివాసరావు (జెడ్పీ స్కూల్, మందరాడ), కె.అశోక్ (జెడ్పీ స్కూల్, సారవకోట), కాళ్ల కుమారి (ఎంపీపీ, సోంపేట), మండ చిన్నమ్మడు (ఎంపీపీ ఎల్ఎన్‌పేట), పాత్రుని భారతి (ఎంపిపి ఆమదాలవలస)లకు నియామక పత్రాలను అందించారు. ఆఫీసు సబార్డినేట్లుగా పనిచేస్తున్న ఎ.తిరుమలరావు (జెడ్పీ స్కూల్, ఒంకులూరు), వై.ప్రమీల (జెడ్పీ స్కూల్ మందస), కె.నాగభూషణం (జెడ్పీ స్కూల్, ఎర్రముక్కాం), ఎంఎస్.భగవాన్‌రెడ్డి (జెడ్పీ స్కూల్, బిఆర్‌సి పురం)లకు రికార్డు అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో ఆర్.వెంకట్రామన్, పరిపాలనాధికారి డివిఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీగా పనిచేయండి

రాష్ట్ర ప్రభుత్వం పారదర్శక పాలన అందిస్తున్న క్రమంలో జిల్లా పరిషత్‌లో కూడా అదే రీతిలో పాలన అందిస్తూ అడుగులు వేస్తున్నాం. గత ఏడాది కొందరికి, ఈ ఏడాది 10 మందికి ఇలాగే కారుణ్య నియామక పత్రాలు అందజేశాం. అయితే కొత్తగా ఉద్యోగాలు పొందిన వారు, పదోన్నతులు పొందిన వారు..ఎవ్వరికీ ఒక్క రూపాయి ఇవ్వనవసరం లేదు. నిజాయితీగా పనిచేస్తే మంచిపేరు వస్తుంది.

– పిరియా విజయ, జెడ్పీ చైర్ పర్సన్

అమృత జలధారకు ఆర్థిక సాయం



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: షెడ్యూల్ కులాల యువ పారిశ్రామిక వేత్తల పథకం, అమృత జలధారకు ఆర్థిక సాయం అందిస్తామని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు.యువ పారిశ్రామిక వేత్తల పథకం, అమృత జలధారలో అర్హులకు సాయం చేసేందుకు ఉద్దేశించిన ప్రధాన మంత్రి అనుచిత్ జాతి అభ్యుదయ యోజనపై ఆయన సంబంధిత అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. అర్హులైన ఎస్సీ లబ్ధిదారులను గుర్తించి జాబితాను మార్చి 29లోగా ఈడీ ఎస్సీ కార్పొరేషన్‌కు అందించాలన్నారు. విత్తనం ఇతర అనుబంధ పనిముట్లను సేకరించేందుకు రూ.10,000 ఆర్థిక సాయం రైతులకు అందించడానికి 344 మందిని గుర్తించినట్లు తెలిపారు. అర్హులైన రైతులు ఆర్థిక సహాయం కోసం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడానికి, వారి పేర్లను ఫార్వార్డ్ చేయడానికి స్థానిక రైతు భరోసా కేంద్రాలు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్లను సంప్రదించాలన్నారు.

ఉద్దానం జీడి తోటల్లో ఎలుగు



జీడి తోటల్లో సంచరిస్తున్న ఎలుగు

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి-గరుడబద్ర పరిసర జీడి తోటల్లో మంగళవారం ఎలుగు కనిపించడంతో వారు హడలిపోయారు. పక్క తోటలో జీడి పిక్కలు సేకరిస్తున్న రైతులు ప్రాణ భయంతో పరుగులు తీశారు.

క్లుప్తంగా

ఎస్పీని కలిసిన పాస్టర్స్



ఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు

శ్రీకాకుళం క్రైమ్ : క్రైస్తవులు ఐక్యతతో చేసుకునే మంచి కార్యక్రమానికి జిల్లా పోలీస్ శాఖ నుంచి తప్పక సహకారం ఉంటుందని ఎస్పీ జి.ఆర్.రాధిక అన్నారు. ఏప్రిల్ 8న జిల్లావ్యాప్తంగా జరగబోయే రన్ ఫర్ జీసస్ కార్యక్రమానికి పోలీసుల సహకారం కోరుతూ జిల్లా, పట్టణ పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీకి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీసు యంత్రాంగం సహకరించేలా ఆదేశాలిస్తామన్నారు. కార్యక్రమంలో పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా నాయకులు డీఎస్‌వీఎస్ కుమార్, పట్టణ పాస్టర్స్ ఫెలోషిప్, క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్, క్రిస్టియన్ బెరేల్ గ్రౌండ్ సీనియర్ సిటిజన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హాకీ క్రీడాకారిణికి అభినందనలు



రేవతిని అభినందిస్తున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్, అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) విద్యార్థిని బి.రేవతి తమిళనాడులో ఈ నెల 19 నుంచి 26 వరకు జరిగిన ఆల్ ఇండియా సౌత్‌జోన్ అండర్ –18 హాకీ పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించింది. జట్టు తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించటంలో కీలక పాత్ర పోషించింది. ఈ సందర్భంగా రేవతిని క్యాంపస్ డైరెక్టర్ పెద్దాడ జగదీశ్వరరావు, ఓఎస్డీ ప్రొఫెసర్ ఎల్.సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహనకృష్ణ చౌదరి మంగళవారం అభినందించారు.

మందుల కంపెనీకి రూ.20 వేల జరిమానా

శ్రీకాకుళం క్రైమ్ : కేంద్ర ప్రభుత్వం ముద్రించిన ధరల కన్నా అధిక ధరలకు విక్రయించిన కేసులో కాడిలా ఫార్మాసూటికల్ కంపెనీ, రిప్రెజెంటేటివ్‌లపై శ్రీకాకుళం ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ (ఏజేఎఫ్‌సీఎం)కోర్టు ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున రూ.20 వేలు జరిమానా విధించింది. ఈ మేరకు ఏజేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి కె.రాణి మంగళవారం తీర్పు వెలువరించినట్లు శ్రీకాకుళం డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ కె.కల్యాణి తెలిపారు. 2014 సెప్టెంబరు 9న అహ్మదాబాద్ దోల్కాకు చెందిన కాడిలా ఫార్మాసూటికల్స్ కంపెనీ ది డ్రగ్ సిప్రడాక్ 250ఎమ్‌జీ (సిప్రోఫ్లోక్సాసిన్ ట్యాబ్లెట్స్ 250 ఎమ్‌జీ) అనే మందులను 2013 ఔషధ నియంత్రణ ధరల ఆర్డర్ ప్రకారం స్ట్రిప్ రూ. 21.21 ప్రభుత్వ ధర ఉండగా.. రూ.33.28 అధిక ఎంఆర్‌పీ ధర లేబుల్ ఉండటం తనిఖీల్లో బయటపడిందన్నారు. దీనిపై అప్పట్లో కేసు నమోదైనట్లు ఆమె తెలిపారు.

సమన్వయంతో నేరాల కట్టడి



సిబ్బందికి సూచనలిస్తున్న లైన్స్ సీఐ వెంకటరావు

ఆమదాలవలస: రైల్వేస్టేషన్, రైళ్లలో జరుగుతున్న నేరాలను జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు సమన్వయంతో పనిచేసి కట్టడి చేయాలని విశాఖపట్నం లైన్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరావు సూచించారు. మంగళవారం శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వే స్టేషన్‌లో జీఆర్‌పీ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసు సిబ్బందికి సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో నేరాల సంఖ్య ఎక్కువగా ఉంటుందని, నిరంతరం నిఘా ఉంచాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాల రవాణాను కట్టడి చేసేందుకు అన్నిశాఖలు కలిసి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150–00
బంగారం(22సి. 10గ్రా.)	51,800–00
వెండి (కిలో)	71,200–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹195	₹ 215

ఆసరా.. జనజాతర!

స్వయం సహాయక సంఘాలకు నిర్వహిస్తున్న వైఎస్సార్ ఆసరా సభలకు అపూర్వ స్పందన లభిస్తోంది. మంగళవారం శ్రీకాకుళం, ఇచ్ఛాపురం, పాతపట్నం నియోజకవర్గాల్లో నిర్వహించిన సభలకు మహిళలు పోటెత్తారు. మహిళా సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న కృషిని మరువలేమంటూ నినదించారు.

– సాక్షి నెట్‌వర్క్



శ్రీకాకుళం రూరల్: కిల్లిపాలెం పంచాయతీలో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా సభకు హాజరైన మహిళలు



ఇచ్ఛాపురం రూరల్: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మహిళలు



ఇచ్ఛాపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద వైఎస్సార్ ఆసరా సంబరాల్లో పాల్గొన్న స్వయంశక్తి సంఘాల మహిళలు



ఎల్.ఎన్.పేట: కోవిలాం కూడలి వద్ద సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రెడ్డి శాంతి

కలెక్టర్‌ను కలిసిన 'రెవెన్యూ' ప్రతినిధులు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సంఘ నాయకులు

శ్రీకాకుళం పాతబస్టాండ్/శ్రీకాకుళం రూరల్: ఇటీవల ఎన్నికైన ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసుల సంఘం కార్యవర్గ ప్రతినిధులు మంగళవారం కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ నవీన్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకు ముందు మంత్రి ధర్మాన ప్రసాదరావును కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసులు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.శ్రీరాములు, కార్యదర్శి రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వేణుగోపాలరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు దిలీప్ చక్రవర్తి, ఏ.సింహాచలం, ట్రెజరర్ జి.ఎల్.ఈ శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.కె.శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ అమర్నాథ్, డి.శ్రీనివాసరావు, బి.సంతోష్ కుమార్, అమరావతి శ్రీకాకుళం జిల్లా జనరల్ సెక్రటరీ రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి సారథులు పడతులే..



రిసోర్స్‌పర్సన్లకు చెక్కు అందిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

- విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయండి
- విపక్షాల విష ప్రచారం నమ్మవద్దు
- వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ సభలో మంత్రి ధర్మాన

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): 'మీ సంతోషానికి కారణమైన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాల్సిన బాధ్యత మహిళలపై ఉంది. సీఎం జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తేనే ఈ పథకాలన్నీ కొనసాగుతాయి. అలాకాకుండా మా ఆయన చెప్పారనో, మా అబ్బాయి చెప్పారనో ప్రతిపక్షాలకు ఓటు వేస్తే ఏమీ చేయలేం..' అని మంత్రి ధర్మాన ప్రసాదరావు స్పష్టం చేశారు. శ్రీకాకుళం నగరంలోని హడ్కో కాలనీ ప్రాంగణంలో వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత చెక్కులు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలను అర్థం చేసుకుని జగనన్న ప్రభుత్వానికి మరోసారి మద్దతుగా నిలవాలని కోరారు. ప్రతి ఇంటినీ అభివృద్ధి చేసి ముందుకు తీసుకెళ్లేది మహిళలేనని, వారికి సమాజంలో గౌరవం పెంచినది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని అన్నారు. గతంలో ఆస్తులు, సంపాదన అంతా మగవాడి పేరిట ఉండేదని.. ఇప్పుడా పరిస్థితి లేకుండా మహిళే ఇల్లు నడిపించే ఆసరా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారన్నారు. నా చిన్నతనం నుంచే ఏటా ధరలు పెరుగుతునే ఉన్నాయని, ఇప్పుడికిప్పుడు పెరగలేదన్న విషయం మహిళలంతా గమనించాలని, విపక్షాల విష ప్రచారాన్ని నమ్మవద్దని కోరారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలకు సలామ్ చేయకుండా పథకాలు వచ్చేవి కాదన్నా విషయం మర్చిపోవద్దన్నారు. హడ్కో కాలనీ అభివృద్ధికి మరింత ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. రిమ్స్ ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేసి 900 పడకలతో ఆధునిక వసతులను సమకూర్చామన్నారు. కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేశు అధ్యక్షతన జరిగిన ఈ సభలో తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్మన్ త్రిపురాన వెంకటరత్నం, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎం.వి.పద్మావతీ, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు సాధు వైకుంఠరావు, గణపతి పట్నాయక్,కొణార్క్ శ్రీను, ఆబోతుల రామ్మోహన్‌రావు, ఆలుగుబెల్లి నాగభూషణరావు, ఎం.రమేష్, టంకాల బాలకృష్ణ, కోటిపల్లి మోహనరావు, కె.బిందుసాగర్, టి.తారక్ తదితరులు పాల్గొన్నారు.

సుందరంగా పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలు



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీని సుందరమైన జంట పట్టణాలుగా మలచాలని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మంగళవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. కాశీబుగ్గ నుంచి పలాస వరకు జరుగుతున్న కేటీ రోడ్డు విస్తరణ పనులు, సెంట్రల్ లైటింగ్, ఫుట్‌పాత్, డ్రైనేజీ తదితర పనులపై చర్చించారు. జాప్యం జరగకుండా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ ఎస్ఈ రాజారావు, ఈఈ సుగుణాకర్, కమిషనర్ రాజగోపాల్ మున్సిపల్ డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు



శ్రీకాకుళంలో ఓ పరీక్ష కేంద్రంలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. బుధవారంతో ద్వితీయ సంవత్సరం (సీనియర్ ఇంటర్) విద్యార్థుల రెగ్యులర్ కోర్సుల పరీక్షలు సమాప్తం కానున్నాయి. ఏప్రిల్ 4వ తేదీ వరకు పలు బ్రిడ్జ్ కోర్సుల పేపర్లకు పరీక్షలు జరగనున్నాయి. మంగవారం జిల్లా వ్యాప్తంగా 109 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 26,028 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా (95.77 శాతం హాజరు) 24,927 మంది పరీక్ష రాశారు. వివిధ కారణాలతో 1101 మంది గైర్హాజరయ్యారు.

ఇందులో జనరల్ కోర్సులకు 24,957 మందికి గాను 1023 మంది, ఒకేషనల్ కోర్సులకు 1071 మందికిగాను 78 మంది డుమ్మా కొట్టారు.

నేడు పోలీసుల ఆధ్వర్యంలో బొడ్డపాడులో వైద్య శిబిరం

కాశీబుగ్గ: బొడ్డపాడు గ్రామంలో బుధవారం క్రీడా పోటీలు, వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కాశీబుగ్గ సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బొడ్డపాడు ప్రభుత్వ కళాశాల మైదానంలో క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయన్నారు. అలాగే మధ్యాహ్నం వైద్య శిబిరం ఉంటుందన్నారు. నేత్ర, గుండె, కిడ్నీ పరీక్షలను స్పెషలిస్టు వైద్యులతో చేపడతామన్నారు. రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పాల్గొంటారన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



నువ్వుల సాగుపై రైతులకు సూచనలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

ఆమదాలవలస రూరల్: సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. నిమ్మతొర్లాడ గ్రామంలో చెరకు, నువ్వుల పంటల సాగును మంగళవారం పరిశీలించి రైతులకు పలు సూచనలందించారు.

నువ్వులపంటలో అధిక దిగుబడులు ఇచ్చే వైఎల్‌ఎం 66 రకంపై క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఎండు తెగులు వచ్చినందున చనిపోయినట్లు మొక్కలు కనిపిస్తున్నాయని, దీని నివారణకు లీటర్ నీటికి మూడు గ్రాముల సాఫ్ గానీ, కాప్రాక్సీక్లోరైడ్ 200 లీటర్ల మందు గానీ పిచికారీ చేయాలని తెలియజేశారు. చెరకులో కొరడా తెగులు నివారణకు లీటరు నీటికి మిల్లీలీటర్ ప్రాపికోనజోల్ మందును కలిపి చేను మొత్తం తడిచేలా పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో విస్తరణ శాస్త్రవేత్త ఎస్.నీలవేణి, ఎస్.అనూష, ఎస్.కిరణ్‌కుమార్, వీఏఏ లావణ్య, రైతులు పాల్గొన్నారు.

క్రైమ్‌కార్నర్

మేకల మందు తాగి వ్యక్తి మృతి

మెళియాపుట్టి: మేకల గాయాలకు వాడే మందును తాగి వ్యక్తి మృతి చెందిన ఘటన మాకనాపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. కోనారి పారోడు (65) మేకలు పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసయ్యాడు.

మద్యం మత్తులో ఆదివారం సాయంత్రం మేకల పుండ్లు నయంచేసే మందును తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే కుటుంబసభ్యులు గమనించి పాతపట్నంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకు శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. పారోడుకు భార్య బుడ్డమ్మ, కుమారుడు రాము ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఏఎస్సై నరసింగరావు తెలిపారు.

రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం



పాతకొజ్జీరియా సమీపంలో లభించిన మృతదేహం

కవిటి: మండలంలోని జాడుపుడి, ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌ల మధ్య పాతకొజ్జీరియా సమీపంలో రైల్వే లైనుపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పలాస జీఆర్‌పీ పోలీసులు గుర్తించారు. మృతుని వయసు 50 నుంచి 53 ఏళ్ల మధ్య ఉంటుందని, మృతదేహాన్ని పలాస ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్టు పోలీసులు తెలిపారు. వివరాలు తెలిసిన వారు పోలీసులను సంప్రదించాలని కోరారు.

రిమ్స్ హాస్టల్లో

విద్యార్థుల కొట్లాట

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ వైద్య కళాశాలలోని బాలుర హాస్టల్‌లో నాగేందర్ అనే సీనియర్ విద్యార్థి తనపై దాడి చేశాడని అభిరామ్ అనే జూనియర్ విద్యార్థి రిమ్స్ ప్రిన్సిపాల్‌కు మంగళవారం ఫిర్యాదు చేశాడు. తనను రాత్రంతా గదిలో బంధించారని ఫిర్యాదు చేయగా అతనికి రిమ్స్ ఆస్పత్రిలోనే చికిత్స చేయించారు. నాగేందర్ కూడా రిమ్స్ అధికారులకు ఫిర్యాదు చేస్తూ అభిరామ్ తనను కొట్టాడని చెప్పగా అతనికీ రిమ్స్‌లోనే చికిత్స అందించారు. అధికారులు వీరిద్దరూ పరస్పరం కొట్టుకున్నారని చెబుతుండగా తోటి విద్యార్థులు మాత్రం అందుకు భిన్న కథనం వినిపిస్తున్నారు. సోమవారం సాయంత్రం అభిరామ్‌కు నాగేందర్ ఓ పని చెప్పగా దానిని తాను చేయలేనని చెప్పడంతో, రాత్రి గదికి పిలిచి కొట్టాడని, నాగేందర్‌తోపాటు మరో ముగ్గురు సీనియర్లు ఇందులో పాల్గొన్నట్లు పేర్లు చెప్పడానికి నిరాకరించిన విద్యార్థులు 'సాక్షి'కి తెలిపారు. దాడి అనంతరం వేకువజామున 5 గంటల వరకు అదే రూమ్‌లో బంధించి ఉంచారని బాధితుడు రిమ్స్ అధికారుల వద్ద వాపోయాడు. ఇద్దరికీ ఎంఎల్‌సీ చేయాల్సి రావడంతో అవుట్ పోస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని అధికారులు బాధితుడికి సూచించారు. బాధితుడు ఫిర్యాదు చేసిన తరువాత ఏం జరిగిందో గానీ ఇద్దరి మధ్య రాజీ కుదిర్చి పంపించేశారు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదును కూడా వెనక్కు తీసుకునేలా చేశారు.

దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి వాస్తవాలు వెలుగు చూస్తే సీనియర్ల జీవితాలు పాడవుతాయని, అందువల్లే రాజీ చేశారని జూనియర్లు చెబుతున్నారు. ఈ విషయమై విచారణాధికారి, రిమ్స్ ఆర్ఎంఓ డాక్టర్ సుభాషిణి వద్ద ప్రస్తావించగా విద్యార్థులిద్దరూ పరస్పరం దాడి చేసుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇద్దరికీ చికిత్స చేయించి విచారణ చేస్తున్నామన్నారు. విద్యార్థుల పేర్లు, దర్యాప్తులో వెలుగు చూసిన అంశాలను తెలియజేసేందుకు ఆమె నిరాకరించారు.

మేనల్లుడి బైక్ ఢీకొని మేనమామ మృతి



పాత్రో మల్లేసు(ఫైల్)



మృతిచెందిన మల్లేసు

నందిగాం: మేనల్లుడి బైక్ ఢీకొని మేనమామ చనిపోయిన ఘటన నందిగాం రెల్లివీధి వద్ద మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నందిగాంలోని గణేష్ కాలనీకు చెందిన పాత్రో మల్లేసు (57) కూలి చేసుకుంటూ జీవిస్తున్నారు. మంగళవారం పని ముగించుకుని చెరువులో స్నానం చేసి ఇంటికి వెళ్తుండగా..రెల్లివీధి దగ్గర ఫ్లై ఓవర్ వద్ద రోడ్డు దాటుతుండగా.. నందిగాంకే చెందిన అతని మేనల్లుడు బెహరా ఇంద్రజిత్తు మద్యం సేవించి బైక్‌పై అతివేగంగా వచ్చి మల్లేసును ఢీకొట్టాడు. మల్లేసు తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బండి నడుపుతున్న ఇంద్రజిత్తు రోడ్డు పక్కన తుప్పల్లో పడిపోయాడు. స్థానికులు స్పందించి క్షతగాత్రుడిని టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. మల్లేసు మృతదేహాన్ని మార్చురీకి పంపించారు. మృతుడు, కారకుడు ఒకే కుటుంబం వారు కావడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మల్లేసు కుమారుడు కూడా గత ఏడాది రోడ్డు ప్రమాదంలోనే చనిపోయాడు. మృతునికి భార్య చంద్రమ్మ, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహమైంది.

యువకుడు అనుమానాస్పద మృతి



మృతుడు లక్ష్మి నారాయణ

బల్లికురవ: మద్యం మత్తు, ఎండతాపానికి గురై రోడ్డు మార్జిన్‌లోనే పడిపోయి యువకుడు అనుమానాస్పందంగా మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మధ్యాహ్నం కొత్తమల్లాయపాలెం గ్రామ సమీపంలో జరిగింది. ఎస్సై వి.వేమన తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన లక్ష్మీనారాయణ (35) కొంతకాలంగా క్వారీల్లో పనిచేస్తున్నాడు. మద్యానికి బానిస కావడంతో ఏ క్వారీలోనూ సక్రమంగా పనిచేయలేకపోయాడు. దీంతో క్వారీల నిర్వాహకులు పనిలో పెట్టుకోలేదు. ఈ క్రమంలో కొత్తమల్లాయపాలెం నుంచి క్వారీలకు వెళ్లే రోడ్డులోని మార్జిన్‌లో పూటుగా మద్యం సేవించి పడిపోయి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ఘటనా స్థలాన్ని పరిశీలించగా మృతి చెందినట్లు గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

ONE SITTING
■ ONE SITTING : 10th, 12th, B.A.,B.Com., B.Sc., M.A., M.Com., M.Sc., B.Ed., BBA., BCA., MBA., MCA., Nursing, Pharmacy, Dip invet, B.Tech from Recog. University in INDIA (For Discontinued) Exam in April. Cont : 73383 76874 [R.963]

COACHING CENTER
■ Eamcet, I-Cet & For All Competitive Exams. New Batches on 01-04-2023 @ 9am. SURYA ACADEMY, GURAJADA Road, Kota Jn., Vizianagaram. Ph : 99490 03295 [V. 6104]

BUSINESS
■ మేము మీ వ్యాపారాన్ని అభివృద్ధి చేయడానికి పెట్టుబడి పెట్టడానికి సిద్ధంగా ఉన్నాము. అలాగే ఏజెంట్లను కూడా ఆహ్వానిస్తున్నాము. ఫోన్: 9092692403 [IA-157]

SERVICES
■ అతి తక్కువ వడ్డీతో ఇల్లు, వ్యక్తిగత, టేక్ ఓవర్, మార్టిగేజ్ లోన్స్ కలవు. CIBIL స్కోర్ తక్కువ ఉన్న ఫైనాన్స్ ఇవ్వబడును. ఏజెంట్లు కావలెను. ✆ 8699691739. [T-1793]

■ వ్యక్తిగత, వ్యాపారం, వ్యవసాయ ఆస్తి, టేక్ఓవర్ లోన్, NPA కేసులు తక్కువ సిబిల్ స్కోర్ కూడా రుణానికి వర్తిస్తాయి. సంప్రదించండి: 94630 26237. [T-1800]

WANTED
■ విజయవాడలో ప్రముఖ హోంకేర్ ఆఫీస్‌కి వృద్ధులకు, బెడ్‌పేషంట్ లకు వారి ఇంటి వద్దె చూసుకొనుటకు కేర్‌టేకర్స్ M/F కావలెను. జీతం 15-20K వసతి+భోజనం 94942 25282, 72070 72559 [B-970]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-795276]

■ URGENT REQUIREMENT AT GUDUR for Manufacturing Company. Drivers-05, Fitters-12, Welder-12 and Business Development Associate-10 (Any Graduate). Please Mail us at : job.gdrp@gmail.com [N-1226002]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారాని ₹3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9959617233, 7386491696 [M-1190657]

■ Req. "Back - End Verification Executives" for Credit Card. Bike & Smart phone must. Whats App Resume : 9652316496 [UA-597]

■ ప్రముఖ బ్యాంకుల యందు కాంట్రాక్టు పద్ధతిలో వర్క్ చేయడానికి ఫీమేల్ స్టాఫ్ అ.కా.ను. జీ.15K to 34K ఇంట్రెస్ట్ ఉన్నవారు డిటెయిల్స్ వాట్సాప్ చేయండి. ఫోన్ : 6281159171 [HA-28700]

■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను ఆయా, వార్డ్ బాయ్స్, నర్సులు, వంటవారు, Rmp Dr, Q: 5th- డిగ్రీ. 10-30 వేలు జీతం, భో+రూ ఫ్రీ, Hyd, Ph: 7995365999 [HA-1151]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.